



# ఆడపిల్లా అనొద్దు!

డి. కామేశ్వరి

అపుడే అన్నం వార్చింది యాదమ్మ. వార్చిన గంజిలో ఉప్పువేసి గుప్పెడు అన్నం మెతుకులు గంజిలో వేసి రెండు గిన్నెలలో పోసింది. అన్నం ఓ పళ్లెంలో సగం పెట్టి సగం కుండలో వదిలిపెట్టి మూత పెట్టి పొయ్యి వెనక్కి పెట్టింది. చిన్న సత్తు గిన్నెలోంచి పండు మిరపపళ్లు చింతపండు కలిపి నూరిన పచ్చడి తీసి మధ్యన పెట్టింది. ఓ ఉల్లిపాయ ముక్కలు కోసి యింకో చిన్న పళ్లెంలో పెట్టింది. 'ఒరే మల్లేశూ సుశీలా బువ్వ తిందురు రండి' గుడిసె బయట ఆడుతున్న కొడుకుని, దీపం బుడ్డి దగ్గర కూర్చుని చదువుతున్న కూతుర్ని పిలిచింది. పదకొండేళ్ల సుశీల పుస్తకం మూసి వచ్చింది.


ఆడుతున్న మల్లేశు మట్టి చేతుల్ని కడుక్కోకుండా పరుగెత్తి వచ్చాడు. 'అరేయ్ పోయి కాళ్లు సేతులు కడగరా, నిండా మట్టిగొట్టుకున్నావు' అంది యాదమ్మ. చెమట కారుతున్న కొడుకు మొహం చీర కొంగుతో తుడిచి, వాడ్ని లాక్కెళ్లి సిమెంటు తొట్టి దగ్గర నీళ్లు తీసి కాళ్లు చేతులు కడిగింది. తల్లిని విడిపించుకుని పరుగునవచ్చి కంచంముందు కూర్చున్నాడు. పళ్లెంలో అన్నం, పచ్చడి చూసి 'కూరేం సేయలేదా నా కొద్దీ పచ్చడి' కోపంగా పళ్లెం తోశాడు. ఆకలిమీద వచ్చిన మల్లేశుకి గొడ్డుకారం చూసేసరికి తిక్కరేగింది. 'కూర ఏడ వండనురా, సేతిలో పైస లేదు. ఏడనించి తెచ్చి వండాల కూర నార. నెలాఖరు పస్తుకింకా రెండు దినాలుంది. నా కాడ పైసలు లేవు. 'పప్పుచారన్నా చేసావా?' యాదమ్మ అపరాధిలా తలదించుకుని 'పప్పు అయిపోనాది... రేపు తెస్తాలే దుకాననించి... యియాల్టికి తిను, దా... మా నాయనగా..' అంది కొడుకుని బతిమిలాడుతూ. సుశీల నిశ్శబ్దంగా వచ్చి కూర్చుంది. తన ముందున్న గంజిగిన్నె, తమ్ముడి ముందున్న అన్నం పళ్లెం వంక చూసి తల్లివంక చూసింది. కూతురు చూపు అర్థం అయింది.

యాదమ్మకి. 'ఏటే ఆ నూవు... మింగుతావా నన్ను. మింగు బతికిపోతాను. అందరికి యాడ వస్తది అన్నం. యిన్ని గింజలుంటే ఉడకేసా. నెలాఖరు సేతిలో పైస లేదని నీకు తెలవదా... పొద్దుటేల రొట్టె సేయనేదా. నిన్న రాత్రి అన్నం మింగ నేదా...' అంది కూతురి భావం అర్థం అయి కోపం వచ్చింది యాదమ్మకి. 'అన్నం నేకపోతే ఆడికెట్టా పెట్టావు. నాకు గంజి, ఆడికన్నమా. ఎప్పుడూ అంతే నీవు. ఆ వున్నదేందో యిద్దరికీ సరింగ పెట్టరాదా' కోపంగా చూసింది. 'ఏటే సరిగా పెట్టేది. ఆడు మొగోడు. సిన్నోడు.... మనం యింటికాడుండే ఆడోల్లం ఏదుంటే అది తినాలి. ఆల్లు సదవాలి. పనికిపోవాలి, కష్టపడాలి సంపాదించాలి అందుకే మొగోడు బలంగుండాలి. ఎప్పుడూ ఆడిమీద నీ కేడుపే. అసలే పైసలు లేవు. నీ గోలనేవడతా. తింటే తిను తినపోతే పో. ఆడి తిండికెపుడూ నీ దిష్టే. కొడుకు కంచంలోంచి ఓ గుప్పెడన్నం తీసి కూతురి గంజిలో వేసింది. 'నా కొద్దే యీ కారం. కూరతే. అమ్మగారేం కూర యీయనేదా... ఎల్లి రత్తమ్మ మామ్మనడిగి యింత ఏదన్నా వట్రా.' కొడుకు అన్నం ముట్టకుండా అలక సాగించాడు. 'అమ్మగారిస్తే నీకే ఎడతాకదురా. పొద్దుటేల యింత సాంబారిస్తే నీకే ఎట్టా యివ్వడేం నేదు. తిను బేగి ఉడుకు సల్లారి పోతంది.' యాదమ్మ గంజిగిన్నె ఎత్తి వేలితో కదిపి తాగడం మొదలుపెట్టింది. మధ్యలో ఉల్లిపాయముక్క కొరికింది.

సుశీల తల్లివంక చూసి యింక తను ఏం అన్నా లాభం లేదు. అలిగి తినకపోతే ఆకలికాగలేదు. మొగాడంట, ఆడు బయటకెల్లి పనిసేయాలంట. ఏం తను బయటకెల్లి పనిచేసి, స్కూలుకెల్లి సదూకోడంనేదూ. తెల్లారి ఆరుగంటలకి ఎల్లి ఓ యింట్లో పనిచేసి మూడొందలు తేడం లేదూ. మళ్లీ వచ్చి స్కూలుకి పోవడం లేదూ. మల్లేశు పనికి పోతన్నాడా, ఆడికేమో అన్నం, కూర అన్నీ వేస్తుంది. అమ్మగారిచ్చిన యిడ్లెనో, పూరిముక్కో ఏదిచ్చినా ముందాడికే పెట్తంది. మనసులో ఉక్రోషం ఎన్నోసార్లు బయటపెట్టినా 'మొగాడితో ఆడోళ్లకి వంతేంటి' అంటుంది. అయ్య తాగి తందనాలాడొచ్చినా, ఆడు డబ్బీయకపోయినా ఆడికి అన్నం పెట్తంది. తను మూడొందలు తెచ్చిచ్చినా గంజినీళ్లు గతి. మల్లేశు స్కూలికి పోకుండా ఆటలాడతాడు. స్కూలుకెల్లినా సదవడు. చదవనివాడ్ని పట్టుకు చదూ అని సతాయిస్తుంది. తను చదువుకుంటానంటే 'పనికిరా, నా ఒక్కత్తె వల్ల గాదు. నీవో రెండిళ్లలో చేయి అని తిడుతుంది. యిదెక్కడి న్యాయమో అనుకుంటుంది. ఐదో క్లాసు చదువుతూ బడికెళ్లే సుశీలకి తల్లి ఆడపిల్లని తనను తక్కువగా చూస్తున్న సంగతి జీర్ణించుకోలేని స్థాయికి ఆలోచనలు ఎదిగాయి.

తను పనిచేసే అమ్మగారింట్లో అబ్బాయి, అమ్మాయి అని తేడా చూపరసలు. యిద్దర్నీ చక్కా మంచి స్కూలుకి పంపుతారు. యిద్దరికి మంచి బట్టలు, ఇద్దరికీ రెండు సైకిళ్లు. ఆడపిల్లవి నీకెందుకు సైకిలు అనరు. ఆడపిల్లవి చదివి ఏం చేస్తావు అని అనరు. అమ్మగారెప్పుడో ఆడేంటి మగేంటి యీ రోజుల్లో అంతా బాగా చదవాలి, ఉద్యోగాలు చెయ్యాలంటుంది. తనతో కూడా రెండు మూడు సార్లంది.' సుశీలా బాగా చదువుకో, లేకపోతే మీ అమ్మలాగే నీవూ అంట్లు తోముకుంటూ బతకాలి. మెట్రిక్ వరకన్నా చదువుకో ఏదో చిన్నపని, లేదంటే ఏదో

'ఏటే ఆ నూవు... మింగుతావా నన్ను. మింగు బతికిపోతాను. అందరికి యాడ వస్తది అన్నం. యిన్ని గింజలుంటే ఉడకేసా. నెలాఖరు సేతిలో పైస లేదని నీకు తెలవదా... పొద్దుటేల రొట్టె సేయనేదా. నిన్న రాత్రి అన్నం మింగ నేదా...' అంది కూతురి భావం అర్థం అయి కోపం వచ్చింది యాదమ్మకి. 'అన్నం నేకపోతే ఆడికెట్టా పెట్టావు. నాకు గంజి, ఆడికన్నమా. ఎప్పుడూ అంతే నీవు.



కోర్సులు చేసుకోవచ్చు అని చెప్పేది. గవర్నమెంటు మీకు జీతాలు లేకుండా చదివించినా చదువుకోరు. డబ్బులకోసం మీ అమ్మలు పనిలో పెడతారు. తప్పుకాదు పనిచేసుకో, కాని చదువుమానకు అంటుందప్పుడప్పుడు. తనకి తెలియని విషయాలెన్నో చెపుతుంది. పదో క్లాసువరకు చదివితే అటెండరు ఉద్యోగాలొస్తాయట. లేదంటే ఏదో కోర్సులు టైలరింగులాంటి పనిదొరికే చదువులు చదవచ్చట.

'మా అమ్మ రోజా పోరెడుతుంది చదువుమానేయమని, నన్ను మా అమ్మ సదవనీయదమ్మగోరూ.' దిగులుగా అంది.

అదేంటే, మీ అమ్మకి మతిపోయిందా ఏమిటి, నిన్ను కూడా తనలాగే పనిమనిషిని చేస్తుందా.

'మా అయ్య యింట్లో డబ్బీయడు, అమ్మ తనొక్కర్తే ఎన్ని యిళ్లల్లో చేస్తాను. ఇంకో యిల్లు వప్పుకో అంటుంది. యింకో యిల్లు వప్పుకుంటే స్కూలికి ఎట్లా ఎల్లాలి నేను' తన గోడు చెప్పుకుంది సుశీల. యిలాంటి స్థితిని ఎలా ఎదుర్కోవాలో చెప్పగల్గిన స్థితిలో లేదు అరుణ. సుశీల తండ్రి ఆటో నడువుతాడు. వచ్చిన దానిలో సగం అద్దెకట్టి మిగిలేది తాగుడికి, పెళ్లాం మరీ పోరుపెడితే అప్పుడప్పుడు యిరవై, ఏభై పడేస్తాడు. అలాంటి మొగుడిని ఏం చెయ్యలేక రెక్కల కష్టంతోటి పిల్లలిని పెంచుతున్న యాదమ్మ సమస్యలు తెలిసి, సుశీలపట్ల సానుభూతి వున్నా ఏం చెయ్యలేని స్థితి అరుణది.

ఆ ఏడాది పరీక్షలయ్యాయి. శలవలయ్యాక స్కూళ్లు తెరిచారు. శలవుల్లో యింకో యిల్లు కూడా పనికి వప్పుకుంది సుశీల. ' స్కూలు తెరిచాక పుస్తకాలు, యూనిఫారంకి డబ్బులు కావాలి గదమ్మా' అంది అరుణ అడిగితే. ఆ పిల్లకి చదువుమీదున్న శ్రద్ధకి ముచ్చటేసినా ఆ పిల్లకి ఎలా సాయపడాలో తెలియదు. తామిద్దరు ఉద్యోగం చేస్తున్నా యిద్దరు పిల్లలిని పెంచి, చదివించి, ఓ యిల్లు ఏర్పరుచుకునే స్థాయిని మించినది కాదు తమ ఆర్థిక స్థితి.

000

స్కూలు తెరిచిన రోజున కళ్లు వాచిపోయేట్టు ఏడుస్తూ పనికివచ్చింది సుశీల. 'ఏమయిందే' అరుణ తెల్లబోతూ అడిగింది. సుశీల భోరుమంది. 'మా అమ్మ కొట్టింది. స్కూలు మానేయాలిట. సదివింది చాలు, నీ పెళ్లి సెయ్యాలి. డబ్బు కావాలి అంటూ రెండు

మూడిళ్లు పనికి కుదిర్చింది. ఏడుస్తూ అరుణ కాళ్లు పట్టుకుంది.' అమ్మగోరు, మీరు సెప్పండి మా అమ్మకి, అమ్మగారూ నా కు డబ్బీయద్దు. మీ ఇంట్లో వుంచుకొని యింత తిండెట్టండి, అన్ని పనులు సేసి పెడతా. నేను స్కూలుకెళ్లి సదూకుంటూ అన్ని పనులూ చేసి పెడతా.' ఆశగా చూస్తూ అడిగింది సుశీల. అరుణ యిబ్బందిగా చూసింది. పన్నెండేళ్ల పిల్ల పూర్తి బాధ్యత తాము తీసుకోగల స్థాయి వుందా. ఆడపిల్ల బాధ్యత తీసుకోడం మాటలా? ఎదిగే పిల్ల, రేపు ఏదన్నా యిటు ఆటు జరిగితే దాని తల్లి దండ్రి ఊరుకుంటారా. అసలు వాళ్ల అమ్మా, నాన్నా దీనికి వప్పుకుంటారా! పిల్లని తమ యింట వుంచడానికి వప్పుకుంటుందా?

"మీ అమ్మ వప్పుకోంటుందే, వూరుకుంటుందా, మా మీద దెబ్బలాటకి దిగదూ."

"నేనాయింట్లో వుండకుండా వచ్చేస్తానమ్మా మా అమ్మ వప్పుకోకపోతే. లేకపోతే మా అమ్మ నాకు పెళ్లి చేస్తది. పిల్ల పెద్దమనిషి కాకుండా సెయ్యాలని అమ్మ అక్కడున్న ఆడోళ్లతో చెపుతూంది. నాకు పెళ్లి వద్దమ్మా యిప్పుడు. సదూకుంటాను, మీ అమ్మాయిలాగా సదూకోవాలని వుందమ్మా.' ఏడుస్తూ అంది. అవును, పిల్లదానికి పెళ్లంటూ అవుడే మొదలుపెట్టింది యాదమ్మ. "సరే నీవు ముందు ఏడుపు ఆపు. నేను అయ్యగారితో కూడా మాట్లాడాలి కదా, మీ అమ్మని కూడా అడగాలి కదా. రేపొకసారి మీ అమ్మను తీసుకురా."

"అమ్మతో చెప్పద్దమ్మా, చెబితే వప్పదు" భయంగా అంది.

"బాగుంది, చెప్పకుండా ఎలాగే, రేపొద్దున నా ఇంటిమీదకి దెబ్బలాటకి రాదూ, అసలు ముందు అయ్యగారొప్పుకోవాలి కదా. అయ్యగారితో, మీ అమ్మతో మాట్లాడాక అలోచిద్దాంలే, వెళ్లు పని చూడు" అప్పటికి సముదాయించింది అరుణ.

000

"ఆడపిల్ల, ఎదిగే వయస్సు పిల్లని ఇంట్లో పెట్టుకుంటే వచ్చే ఇబ్బందులు అలోచించు, రోజంతా మనం ఇంట్లో ఉండం, ఏదన్నా అటుఇటు జరిగితే జవాబుదారి నీదవుతుంది. అనవసరమైన గొడవలు నెత్తికెక్కించుకోకు" అన్నాడు శ్రీనివాసరావు అరుణ చెప్పింది విని,

"మన అమ్మాయి ఉండడం లేదా ఇంట్లో. మనం ఇంటికొచ్చే లోపల అది, దానికి ఇది తోడుగా ఉంటారు. ఇదీ స్కూల్‌కెళ్లి సాయంత్రం వస్తుంది కదా, ఇంట్లో పని పూర్తిచేసి స్కూలుకెడుతుంది. వీళ్లతోపాటు సాయంత్రం చదువుకుంటుంది. మనకు పిల్లలకు అందరికి ఇంకాస్త సాయం అదింట్లో ఉంటే. దానికెలాగో మూడొందలు ఇస్తున్నాం. ఇంట్లో పెట్టుకుని తిండిపెట్టి, మన పిల్లల బట్టలు ఇస్తే చాలు. దానికోరిక తీరుతుంది. మనకూ సుఖం, ఈరోజుల్లో ఇంట్లో పెట్టుకుందామన్న ఎవరు దొరకుతున్నారు. పాపం అది చదువుకోవాలని ఆశపడ్తొంది. వాళ్లమ్మ పన్నెండేళ్లకే పెళ్లి చేసి పంపేస్తుంది. దీనికి రేపు పెళ్లి, పిల్లలు, మొగుడు, తన్నులు భవిష్యత్తు వీళ్లందరి బతుకు ఇంతే కదా. లోకంలో అందరిని బాగుచేయలేం. ఏదో ఒక్క పిల్లనన్నా కాస్త ఆదుకుని దానికాళ్ల మీద అది నిలబడేట్టు చెయ్యాలనిపిస్తోంది. దానికి కాస్త ఉపకారం, మనకు కాస్త సాయం" అరుణ చెప్పింది సబబుగానే అనిపిస్తున్నా ఇంట్లో పెట్టుకుంటే వచ్చే సమస్యలు కాస్త ఆలోచనలో పడేశాయి శ్రీనివాసరావుని. ఆఖరికి 'నీఇష్టం, ఆలోచించుకో. వాళ్ల అమ్మ ఒప్పుకుంటుందో లేదో ముందు అడిగి చూడసలు. వాళ్లతో తగూలు పెట్టుకుని మాత్రం వద్దు. వాళ్లు వచ్చి మన మీద ఏడ్చి గొడవలు పెడితే మాత్రం వద్దు" అన్నాడు. "నాకామాత్రం తెలియదా. వాళ్లమ్మకి నచ్చచెబుతా" అంది అరుణ.


000

యాదమ్మకి నచ్చచెప్పడం అంత సులువైన పనికాలేదు. "మాకు సదూలెందుకమ్మా. ఇంకో రెండిళ్లలో పని చేసుకుని కాస్త డబ్బులు వెనకేసి ఆడపిల్ల పెళ్లి సెయ్యాల. సదూకుంటే మొగుడ్నెక్కడ తేవాలి. చిన్నపిల్ల దానికేం తెలుసు, అది కాకపోతే, అది తెచ్చే డబ్బులు లేకపోతే యిల్లెలా గడుస్తుందమ్మా. ముందు కడుపునిండితే గదమ్మా సదువులు, సట్టుబండలు. ఒక్కర్తినీ నేనెలా యిల్లు గడపను.

'నీ మొగుడ్ని నిలబెట్టి అడగాలి డబ్బు. పెళ్లాడి, పిల్లల్ని కని పట్టనట్టు వూరుకుంటే.. నీ ఊరుకుంటే మహా చక్కగా జల్సా చేసుకుని తాగి, తిని తిరుగుతాడు. మొగుడ్ని వదిలి, చిన్నపిల్ల దాని జీవితం పాడుచేస్తే ఎలా. పాపం అది చదువుకుని ఏదో ఉద్యోగం చేసుకోవాలని ఆశపడ్తుంది. దాని బతుకు బాగుపడాలని లేదా నీకు.' 'వుంటుందమ్మా, కాని ఏం చెయ్యను. ఆ దొంగ సచ్చినోడు తిన్నగుంటే నాకీ తిప్పలెందుకు తాగి డబ్బులడిగితే తన్ని యింట్లో కుండమండ బద్దలుకొట్టి పోతాడు. వాడిచేత పళ్లు కుళ్లబొడిపించుకోడం ఎన్నిసార్లయింది. అందుకేనమ్మా యిప్పుడాడి జోలికిపోను. కట్టుకున్న పాపానికి, ఏదో మొగుడున్నాడు. మొగాడి అండ వుందిలే అన్న ధైర్యంతో ఏదో ఆడికింత తిండెట్తున్నాను. నా ఒక్కర్తివల్ల కాక కాదమ్మా సుశీలని పనికి పెట్టింది. ఏం సదువుతుంది. మహా అయితే పదో క్లాసు చదివాకన్నా పెళ్లి చెయ్యాలి గదమ్మా. కాలేజీలకి పంపి బి.ఏలు ఎమ్మేలు సదివించే తాహతు మాకుందా. పదోక్లాసంటే పదహారు, పదిహేడేళ్లొస్తాయి. అంత సదివిన దానికి మొగుడ్ని ఏడ తేను మీరే చెప్పండి. 'పెళ్లో, పెళ్లో అని ఎందుకు గోల. చదువుకుని ఏదో ఉద్యోగం సంపాదించుకుంటే నీకు సాయంగా వుండదా. పెళ్లికేం తొందర. తరువాతెప్పుడో కావాలంటే చేసుకుంటుంది. అనవసరంగా ఆలోచించి యిప్పుడు దాన్ని చదువు మాన్పించకు.' దాన్నెలాగేనా వప్పించాలని అరుణ ఆరాటం.

'అదిలేకపోతే మరి నాకు రోజులెలా గడుస్తాయమ్మా. దాని సంపాదనలేకపోతే'.

'ఏం దాన్నే అంటావు. నీ కొడుకున్నాడు గదా. వాడ్ని ఎక్కడన్నా పొద్దుట సాయంత్రం పనిలోపెట్టు, వాడేమో చదవడు, చదువుతానన్నదాన్ని వద్దంటావు. తిని రోజంతా




తిరుగుతాడు. ఏ హోటల్లోనో, దుకాణంలోనో పనికి పెట్టు. స్కూలుకి అడ్డురాకుండా. 'ఆడు మగాడు, కాస్త అక్షరంముక్క రావద్దా. రేపు ఏ పనిసెయ్యాలన్నా సదువుండాలి గదమ్మా. యింకా చిన్నాడు, వాడికేం చాతనవుతుంది పని' యిబ్బందిగా అంది. కొడుకు పట్ల దానికి ఉన్న ప్రేమ, సుశీల ఆడపిల్లని దానిపట్ల నిర్లక్ష్యం అన్న తెలిసిన అరుణ ఆ తేడా చూపడం సహించలేకపోయినా అంతకంటే ఏం అనాలో తెలీలేదు. 'ఏమో యాదమ్మా. నీ కూతురు పాపం ఏడుస్తోంది చదువు చదువు అని నేను దాన్ని యింట్లో పెట్టుకుని దానిచేత యిప్పట్లాగే పని చేయించుకుని తిండి, బట్ట, దాని అవసరాలు అన్నీ చూసుకుంటూ చదివిస్తాను నీవు ఒప్పుకుంటే. నీ కిష్టం లేకుండా నేనేం చెయ్యగలను. అది బాగుపడాలంటే నీవు ఒప్పుకో. లేదంటే అది తెలిసి తెలియని వయసులో ఏ అఘాయిత్యమన్నా చెయ్యొచ్చు. లేదంటే ముందు ఆలోచన లేకుండా ఎటన్నా పారిపోతే దాని బతుకు బండలవుతుంది. చూసుకో.' కాస్త బెదిరిస్తున్నట్టుగానే అంది. ఆలోచనలో పడింది యాదమ్మా.' నీ కూతురు తిండి బట్ట ఖర్చులు తగ్గుతాయి కదా దాని సంపాదన లేకపోయినా గడవదా. నీవు, కొడుకు గదా నీవింకో యిల్లు ఎక్కువ చేసుకో. నా మాట విని మీ వాడిని కాస్త ఎక్కడో పనికి కుదుర్చు. వాడిమీద ప్రేమతో దీని బతుకు బలిపెట్టకు. దీన్ని చదువుకోనీ.

'ఆడితో కూడా ఓ మాట అంటాను. మా మరిది వుంటాడు. ఆల్లతో కూడా అడిగి చూస్తాను.' కాస్త మెత్తబడింది. చాటున వింటున్న సుశీల తల్లి మెత్తబడటం చూసి 'అమ్మా నేనిదే చెపుతున్నా. నన్నుసదుకోనీయకపోతే యింత యిసం తాగి సస్తా. లేదంటే రైలుకింద తలఎడతా. యింట్లోంచి పోతా, యిక్కడుండి నా బతుకు నే బతకతా. మల్లా నీ మొగం సూడ.' గట్టిగా అరిచి విస విస వెళ్లిపోయింది సుశీల. యాదమ్మ దిగాలుగా చూసి లేచింది.

000

ఆ సాయంత్రం సుశీల చాలా ఆనందంగా వచ్చింది. 'అమ్మగారూ మా అమ్మ ఒప్పుకుంది. నేనింక యీడనే వుండిపోతా.' సంచినిండా బట్టలు, స్కూలు బ్యాగులో పుస్తకాలు తెచ్చుకుని




సంబరంగా వచ్చింది. 'మీ అమ్మ ఒప్పుకుందన్నమాట మీ అయ్య ఏమనలేదా' ఆనందంగా అడిగింది అరుణ.

'అయ్యా, అమ్మ బాగా దెబ్బలాడుకున్నారు. 'నా బతుకు ఎట్లాగో సట్టుబండలయ్యింది అదేనా బాగుపడనీ, నీ కొడుకు ఎలాగో పోరంబోకులా నీలాగే తయారవుతున్నాడు. దాన్నేనా బాగుపడనీ, యింకో యిల్లు రెక్కల కష్టం సేసుకుంటా, దాన్ని సదూకుని బాగుపడనీ' అందండి అంటూ పెద్ద కళ్లు తిప్పుతూ తల్లి తండ్రి దెబ్బలాటంతా చెప్పుకొచ్చింది. 'ఆడముండలు, బరితెగించారు. అంతా మీ పెత్తనాలేనా' అంటూ జుత్తు పట్టుకు కొట్టాడండి. అమ్మ శివంగిలా లేచి అడ్డి తోసేసి, 'అది యీ పాడుకొంపలో వుండదు. అది సదూకొని ఉద్యోగం చేస్తది. నీవు దాని జోలికెడితే, నన్నేదన్నా అంటే పోలీసుల కాడ కెల్లి కంప్లైంట్ యిస్తాను. లేదంటే నే సచ్చి నీవే చంపావని పోలీసులకి ఉత్తరం రాసి పెడ్తా' అని బాగా బెదిరించింది. 'నీవు మళ్లీ గొడవెట్టావంటే నా పిల్లలని తీసికెల్లి యీ ఊరొదిలి పోతా' నందండి. అప్పుడు అయ్య బూతులు తిడుతూ ఎల్లి పోయాడండి.

'మా యింటికి వచ్చి గొడవ పెట్టడు గదా. అయ్యగారికిష్టం వుండదు.' అనుమానంగా అంది. అమ్మ సూసుకుంటానంది ఆడి సంగతి. మీ యింటికి వచ్చినా మీరు పోలీసులని బెదిరించమంది అమ్మ' అంది. ఆ విధంగా సుశీల చదువుకి పునాది పడింది.

ఆ పునాదిమీద పెద్ద భవంతే నిలబడ్తుందని అరుణకూడా ఆనాడు ఊహించలేకపోయింది. అరుణ ఉద్దేశం, ఆశయం సుశీలని ఏ మెట్రిక్ వరకో చదివించి ఏదన్నా వృత్తివిద్యలలో ట్రెయినింగు యిప్పించి ఏదో ఉద్యోగంలో ప్రవేశపెట్టి ఆమెకు స్వంత సంపాదన వుండేట్టు చూడాలన్నదే తాపత్రయం. కాని సుశీల మెట్రిక్ చదువుతుండగా అదృష్టం అరుణ తమ్ముడిరూపంలో వచ్చి తలుపుతట్టింది.

000

అరుణ తమ్ముడు శరత్ అమెరికాలో హూస్టన్‌లో ఓ కంపెనీలో కంప్యూటర్ ఇంజనీరు. రెండేళ్లకో మూడేళ్లకో ఓసారి ఇండియా శలవులకి వస్తాడు. సుశీల తొమ్మిదో క్లాసు చదువుతుండగా శరత్ వచ్చి సుశీలని చూశాడు. 'ఎవరే ఈ అమ్మాయి, చాకులా వుంది బలే దాన్ని పట్టావు. ఎంత బాగా చేస్తుంది పని పాటు, అదృష్టం, నీ కెలాంటి అమ్మాయి దొరికింది పనికి, ప్లీజ్ సుశీలని నాతో అమెరికా పంపవే. వసంత, నేను చంటి పిల్లాడితో చాలా అవస్థపడుతున్నాం. నెలకి రెండొందల డాలర్లు యిస్తాను. అంటే పదివేలు నెలకి. ఆ అమ్మాయి బతుకు బాగుపడ్తుంది. మాకూ సాయం వుంటుంది. వాళ్లమ్మతో చెప్పవే అక్కా. బతిమిలాడాడు. అరుణ కాస్త కోపంగా చూసింది. 'శరత్, ఆ అమ్మాయిని కేవలం పని చేయించుకోడానికి పనిమనిషిగా పెట్టుకోలేదు నేను. ఆ అమ్మాయిని యింట్లో పెట్టుకుని చదివించి ఏదో ఓ ఉద్యోగం చూపించాలని నా ఉద్దేశం. కేవలం పనిపిల్ల మాదిరి అనుకోడం లేదు తెలుసా, ఆ అమ్మాయిని కనీసం మెట్రిక్ వరకు చదివించి ఏదో వృత్తి విద్యా కోర్సులో పెట్టాలని నా ప్లాను. ఆ పిల్ల చదువు ఆపి నీతో పంపేస్తే, జీతం ఎక్కువ రావచ్చు. కాని పనిపిల్లగానే మిగిలిపోతుంది. అది నాకిష్టం లేదు. అరుణ గంభీరంగా అంది. శరత్ ఒక్క క్షణం ఆలోచించాడు. 'నీవు అన్నది బాగుంది అక్క. ఈ విధంగా ఆలోచించినందుకు నిన్ను అభినందిస్తున్నాను. పోనీ ఒక మంచి పని చేస్తున్న తృప్తి నీకు దక్కడం న్యాయమే. అక్క పోనీ ఈ అమ్మాయి మెట్రిక్ అయ్యాక నాతో అమెరికా తీసుకెడతా, ఇంట్లో పెట్టుకుని నీవన్నట్టే ఏదన్నా కోర్సు చేయిస్తా. ఆ అమ్మాయి తన కాళ్లమీద నిలబడేట్టు చేస్తా. ఇక్కడ ఏం చేసినా ఏ రెండువేలో కన్నా ఈ చదువుకి జీతాలు రావు. అమెరికా అయితే డాలర్లలో సంపాదించి తల్లికి పంపి ఆదుకునే వీలుంటుంది. ఈ మంచి పనిలో నన్ను పాలువంచుకోనీ, ఇంట్లో సాయం ఉంటుందన్న స్వార్థంతో పాటు, ఒక అమ్మాయిని ఉద్ధరించానన్న ఆత్మతృప్తి నన్ను పొందనీయి.

నీవు బాగా ఆలోచించు. వాళ్లమ్మతో మాట్లాడి ఒప్పించు. ఈసారి వచ్చినప్పుడు వీసా అప్లైచేసి తీసుకెళ్లే ఏర్పాటు చేస్తా' అన్నాడు శరత్. అరుణ ఆలోచనలో పడింది.

000

మెట్రిక్ అయ్యాక ఆ ఎండాకాలం శలవుల్లో శరత్ వెంట అమెరికా వెళ్లిన సుశీల ఆరేడేళ్ల తరువాత ఇండియా వచ్చింది. నర్స్ ట్రైనింగ్ పూర్తిచేసి ఉద్యోగంలో చేరే ముందు "అమ్మగారూ. ఉద్యోగంలో చేరేముందు మీకు కనబడి ఆశీర్వచనం తీసుకెళ్లాలనే వచ్చాను" అంటూ కాళ్లకి నమస్కరించింది కళ్ల నిండా నీరు నిండగా. అరుణ కళ్లూ చెమర్చాయి సంతోషంతో. సుశీల మొఖం తేటవడింది. కళ్లు విజ్ఞానం, ఆత్మవిశ్వాసం ప్రతిఫలిస్తున్నాయి. ఇరవైమూడేళ్ల పరువం తీసుకొచ్చిన సోయగం. అమెరికాలో పెరిగిన వాతావరణంలో రంగు వచ్చి నాజూగ్గా, స్మార్ట్‌గా, చలాకీగా మంచి ఇంగ్లీషు మాట్లాడుతూ, మాటల్లో సంస్కారం పుట్టిపడుతూన్న ప్రవర్తన తను నాటిన మొక్క పెరిగి పెద్దయి చిక్కని ఆకులు తొడిగి మొగ్గై, పువ్వైన వేళ కలిగే సంతోషంతో అరుణ కళ్లు తుడుచుకుని సుశీల బుజాలు పట్టుకు లేవదీసి 'అమ్మగారేంటి యింకా, యిప్పుడు నీవుద్యోగస్థురాలివి. నాకంటే ఎన్నో రెట్లు ఎక్కువ సంపాదింస్తున్నదానివి.' అరుణ సుశీల భుజం తడ్తూ అంది. 'ఇదంతా మీ చలవ, మీరు పెట్టిన భిక్షే. నేనెన్ని లక్షలు సంపాదించినా మీరెవ్వటికీ నా అమ్మగారే.' అంది సుశీల కృతజ్ఞతతో గొంతు నిండుకోగా.' అమ్మా, మీకు, శరత్ గారికి ఏమిచ్చి ఋణం తీర్చుకోను. మీరు అమెరికా వెళ్లమని సలహా యివ్వడం, మీ తమ్ముడుగారు నన్నాదరించి తీసికెళ్లి దగ్గరుంచుకుని చదివించి, నర్సింగు కోర్సులో జాయిన్ చేసి నా బతుకుకి ఓ మంచి తోవ చూపడం, యీనాడు నన్ను నేనే కాక కుటుంబం మొత్తానికి ఆదుకో గల్గిన స్థాయికి ఎదిగానంటే కారణం మీరే అంది సుశీల కృతజ్ఞత నిండిన గొంతుతో.

'నే చేసిన సాయం చిన్నది సుశీలా, ఓ లేత మొక్క ఆలంబన లేక నేలమీద పాకుతుంటే చిన్న కర్రముక్క ఆలంబనగా నిలబెట్టి చెట్టుపాకించి, తరువాత ఓ పందిరి వేసి అల్లుకునేట్టు చేశాను. నా సాయం అంతేగా.' 'అది ఎంత పెద్ద సాయం అమ్మా, లేకపోతే నేలమీద పాకిన ఆ మొక్క ఎవరి కాళ్లకిందో నలిగి, లేక ఏ పశువల కాహారం అయ్యేది గదమ్మా. మీరానాడు చేయూత నివ్వకపోతే ఈపాటికి ఇద్దరు ముగ్గురు పిల్లల్ని కని, మొగుడితో తన్నులు తినే బతుకే నాదీ అయ్యేది! మామూలు బతుకునించి దారి మళ్లించి సరి అయిన దారిలో పెట్టారు. ఇంతకంటే ఇంకేం చేయాలమ్మా!' సుశీల కళ్లు తుడుచుకుంది.

మెట్రిక్ అవగానే శరత్‌తో అమెరికా వెళ్లడానికి ఏర్పాటు చేసింది. సుశీలకి, యాదమ్మకి అమెరికా వెడితే లభించే లాభాలు చెప్పింది. ఇక్కడెంత సంపాదించినా ఏదో తిండి గడిచిపోతుంది తప్ప మీ బతుకులు బాగుపడవన్నది అర్థం అయ్యేట్టు చెప్పింది. శరత్ ఇంట్లో వాళ్లకి సాయంగా వుంటూ చదువుకుని, వాళ్లు ఏదో కోర్సులో చేర్పించే తోవ చూపిస్తారని, తరువాత బోలెడు సంపాదించవచ్చని చెప్పింది. వీసా ఏర్పాట్లు శరత్ చేసి వెళ్లాడు.

అక్కడ శరత్ యిచ్చే జీతం రెండొందల డాలర్లలో ఏభై డాలర్లు తన ఖర్చుకుంచుకుని నూట యాభై అరుణ పేర పంపేది. నూరు డాలర్లు రూపాయల్లో తల్లికిచ్చి ఏభై డాలర్లు బ్యాంకులో వేయించేది. కూతురు డబ్బు పంపడం ఆరంభించాక యాదమ్మ పనిమానింది. తమ్ముడు చదవక అల్లరి చిల్లరిగా తిరుగుతూంటే తల్లి తమ్ముడు కలిసి కిరాణా కొట్టు పెట్టుకునేట్టు డబ్బిచ్చింది. నర్సింగ్ కోర్సుకి అమెరికాలో మంచి డిమాండుంది. సుశీలలాంటి నెమ్మదైన పిల్లకి నర్సు ఉద్యోగం సరి అయినదని ఫోనుచేసి అరుణతో చెప్పి చేర్పించాడు. నర్సుకోర్సు పూర్తి అయి ట్రైనింగు అపుడు దొరికే స్టైఫెండు జాగ్రత్తగా దాచి నెల నెలా అరుణ పేర పంపి, కొంత హౌసింగులోను తీసి తల్లికి చవకలో దొరికేచోట ఓ అపార్టుమెంటు కొనిచ్చింది. యాదమ్మ నెల నెల అరుణ దగ్గర డబ్బుతీసుకోడానికి వచ్చినప్పుడల్లా అరుణ కాళ్లు పట్టుకు ఏడ్చేసేది. 'అమ్మా, ఆడపిల్లని దాని పీడ త్వరగా వదుల్చుకోవాలని ఎవడికో కట్టబెట్టి దాని బతుకూ నా బతుకులాగే చేసేదాన్ని. ఆడపిల్లే ఈనాడు చూడండమ్మా నాకో ఇల్లు. దుకాణం, నెలకి ఐదువేల డబ్బు ఇన్నీ చేస్తూంది. మీ ఋణం ఎలా తీర్చుకోనమ్మా' అంటూ దండాలు పెట్టి ఏడ్చేది.

ఈసారి సుశీల తల్లిని తనతో తీసికెడతానంది. ముందుగానే పాస్‌పోర్ట్ వీసా అది తీసింది. తమ్ముడికి తానుండగానే మేనమామ కూతురితో పెళ్లి చేసేసి వాడి సంసారం వాడికి ఏర్పాటు చేసింది. తను పనిచేసే ఆస్పత్రిలో ఓ లాబ్ అసిస్టెంట్‌ని ప్రేమించి పెళ్లాడాలని మేం యిద్దరం అనుకుంటున్నాం అని చెప్పినప్పుడు అరుణ ఆనందానికి హద్దులేదు.

అమెరికా వెడ్తున్న యాదమ్మ సంబరం చెప్పడానికి మాటలు లేవు. వాడ వాడంతా యాదమ్మ అదృష్టానికి నిజంగానే సంతోషించారు. యాదమ్మ, సుశీల వెళ్లేముందు అరుణకి దండం పెట్టడానికి వచ్చినప్పుడు యాదమ్మ కళ్లల్లో ఆనందం, గర్వం, సుశీల కళ్లల్లో ఆత్మవిశ్వాసంచూసి తన ఆశయం నెరవేరింది. ఈ తృప్తి ఎంతటి ఆనందాన్నిచ్చిందో అరుణకి అనుభవంలోకి వచ్చింది. సుశీల కథకి అంత చక్కటి ముగింపు దొరికిందన్న ఆనందం అరుణది! ■

